# పరమాత్మను గుర్తించినవారే గోపికలు

హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరిమయము గానిద్రవ్యము
పరమాణువు లేదు యిలను పరికించినచో

ప్రేమలేనట్టి మనసది ప్రేతభూమి
అనగ నొప్పరు నిజముగ అవనియందు
శ్వాస నిశ్వాసలను రెండు సలుపుచుండు
కొలిమి తిత్తిని ప్రాణిగా తలపగలమె!

ప్రేమ స్వరూపులారా!

ప్రేమయే భగవంతుడు. సర్వత్రా నిండినది ప్రేమయే. ఈ ప్రేమను ప్రేమచేతనే పొందగలము. ఈ ప్రేమ తప్ప ప్రేమ స్వరూపుని పొందుటకు మరొక మార్గము లేదు. ఇట్టి ప్రేమ క్షణములో పెరిగి క్షణములో తరుగునటువంటిది కాదు. ఈ ప్రేమయే మానవునియందు ఆత్మస్వరూపంగా నిలిచిఉంది. దేహోదేవాలయ ప్రోక్తో దేహమే ఒక దేవాలయము. ఇందులో ప్రేమయే ఆత్మస్వరూపుడు. ఇట్టి పవిత్రమైన ప్రేమ నిర్మలమైన హృదయమునందు ప్రతిష్ఠితమై ఉంటుంది. కనుక ప్రేమమయముగాని హృదయమునందే భయము భ్రాంతులు నిండి ఉంటాయి. భగవత్ప్రేమగల హృదయము నిరంతరము నిర్భయముగను, నిశ్చింతగను ఆనందమును పొందుతూ ఉంటుంది. క్షణములోనె తరుగుచు, క్షణములోనే పెరుగునట్టిది నిజమైన ప్రేమకాదు.

చావు పుట్టుక లేనట్టి జీవునెదలో
నిత్యనిర్మల జ్యోతియై నెగడు ప్రేమ

కనుక భగవంతుని ప్రేమ స్వరూపుడని చెప్పటంకంటె ప్రేమయే తనయొక్క స్వరూపమని

sri sathyasai vachanamrutam

చెప్పటం చాలా మంచిది. అట్టి ప్రేమనే ఆత్మస్వరూపంగా భావిస్తూ అనేకమంది ఆరాధనలు సలుపుతూ వచ్చారు.

ప్రేమ భగవత్స్వరూపము అగుటచేతనే దేహోదేవాలయః దేహమును దేవాలయముగా పోల్చుకోగల్గారు. అంతేకాదు. ఇది ఒక భవనంగా విశ్వసిస్తూ వచ్చారు. నిర్దోషో నిర్మలో నాథః , సదోషో, చంచలో వధుః. నిర్దోషియై నిర్మలమైన భర్త, దోషియైచంచలమైన ఒక భార్య ఈ గృహములో జీవిస్తున్నారు. దోషియైన భార్య నిర్దోషియైన భర్త, నిశ్చలమైన భర్త, చంచలమైన భార్య, ఈ ఇరువురు గృహమునందున్నప్పుడు శాంతి అనేది ఏ రీతిగా మనకు లభిస్తుంది? ఈ గృహమునందు శాంతి సంతోషములు అంకురించవలెనన్న భర్త అయినా భార్యను అనుసరించాలి. భార్యయైనా భర్తను అనుసరించాలి. ఇందులో విచారించి చూసిన నిర్దోషి నిర్మలమైన భర్త, దోషి, చంచలమైన భార్య ననుసరించటము ఇది ధర్మ విరుద్ధము. దోషియై చంచలమైన భార్య నిర్దోషి నిర్మలమైన భర్తను అనుసరించటమే సహజము. ఇక్కడ భర్త ఎవరు? భార్య ఎవరు? నిర్దోషియై నిర్మలమై, నిశ్చలమై, నిస్స్వార్థమైన ఆత్మయే భర్త. దోషియై, చంచలమై, స్వార్థమై, పరితాపముతో ఉన్న ఈ భార్యయే మనసు. ఈ మనసు ఆత్మ ననుసరించే నిమిత్తమై చేసే ప్రక్రియనే భక్తి.

ఈ భక్తికి అనేకమైన పేర్లు గలవు. భక్తి అనగా సేవయే అని భాగవతము బోధించింది. భజసేవాయాం, హృషీకేశసేవనం భక్తి రుచ్యతే అన్నది. భగవంతుని సేవించటమే భక్తి అన్నది. అనగా మనయొక్క దృష్టిని ఆత్మపై నుచంటమే భక్తి. ఆత్మ దృష్టితో జీవితం గడపటమే భక్తి. దేహదృష్టితో జీవితము గడపటమే మోహము. కృష్ణతృష్ణ కలిగినవారే గోపికలు. విశ్వతృష్ణ కలిగినవారే జీవులు. కనుకనే ఈ జీవుడు దేవునిగా అనుభవించటానికి ఆత్మదృష్టిని పెంచుకోవాలి. నిరంతరము కృష్ణతృష్ణతో కాలమును సార్థకంగావించుకొని తమ జన్మనుకూడను పవిత్రం గావించుకున్నవారు గోపికలు.

అయితే భగవంతుడు ఎలాంటిరూపం కలిగిఉంటాడు? ఏ విధంగా మానవులను అనుగ్రహించటానికి తగిన ఆదర్శంగా ఉంటాడు? భగవంతుడనగా ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, సంపద, జ్ఞాన వైరాగ్యములనే ఈ షడ్గుణ సంపత్తితో కూడి ఉంటాడు భగవంతుడు.

sri sathyasai vachanamrutam

వషట్కారుడు అనికూడా అతనికి ఒకపేరు. షడైశ్వర్య సంపన్నము కలిగినవాడు కనుకనే ఇతనికి విభుడు అని ఒకపేరు. ఇతనే ఈ జగత్తునందు ఉన్నదానికి, రాబోయేదానికి, జరిగిన దానికి కూడా తానధిపతిగా ఉంటున్నాడు. కనుకనే భూత భవిష్యత్ వర్తమానములకు నాథుడైనటువంటివాడు కనుకనే ఇతనికి భావరి అని పేరు వచ్చింది. తాను కాలములతో లీనమై ఉండేవాడు. భావరి అనగా జగత్తునంతా సృష్టించేవాడని అర్థము. సూర్యచంద్రాదులకు, నక్షత్రాదులకు ప్రకాశం అందించేవాడు కనుకనే ఇతనికి భావరి అని పేరు. సమస్త సృష్టి స్థితి లయములకంతా మూలకారకుడు కావటం చేతనే యితనిని భావకుడు అన్నారు.

## భగవంతుడు సర్వత్రా ఉన్నాడు

ఇట్టి భగవంతుడు సర్వత్ర ఉండుటకు సాక్ష్యమేమిటి? దీనికి చక్కని చిన్న ఉపాయం మనం గుర్తించాలి. దైవము ఎక్కడ ఉన్నాడు. అని విచారణ చేసినప్పుడు నీరు, గాలి ఎక్కడ ఉన్నదో అక్కడంతా భగవంతుడున్నాడు. నీరు గాలి ఆత్మనుండియే ఆవిర్భవించాయి. కనుక భగవంతునికి నారము అని మరొకపేరు. జీవికి ఆధార భూతములైన ఈ గాలి, నీరు అత్యవసరము. ఇవియే మన ప్రాణధనమైన ఆత్మస్వరూపము. ఇట్టి భగవతత్త్వము సర్వత్రా ఉండినప్పటికి మానవులు గుర్తించుకోలేకపోతున్నారు. అణోరణీయాన్ మహతో మహీయాన్. భగవంతుడు దేహమునందు ఆత్మస్వరూపుడై ఉంటున్నాడు. ఆత్మ అనే స్వరూపము దేహమునందు మాత్రమే కాదు సర్వత్రా కూడా ఉంటున్నది. అంతర్బహిశ్చ తత్ సర్వంవ్యాప్య నారాయణ స్థితః లోపల వెలుపల సర్వత్రా ఉండినటువంటిదే యీ భగవత్ తత్త్వము.

ఇలాంటి ప్రేమ తత్త్వాన్ని మానవుడు గుర్తించటమే ప్రధాన కర్తవ్యము. మానవునకు రెండు ప్రధానమైన అంగములు. ఒకటి తల, రెండవది హృదయము. ఈ తల నిరంతరము బాహ్యమైన దానినే ఆశిస్తూ ఉంటుంది. కేవలము తాత్కాలికమై భౌతికమై, లౌకికమైన వస్తువులను, వ్యక్తులను, విషయములను మాత్రమే ఆశిస్తూ ఉంటుంది. కనుక ఏతావాతా ఈ శిరస్సుకు ప్రవృత్తి లక్షణ మున్నదని చెప్పవచ్చును. ప్రవృత్తి నుండియే ఈ సమస్త సంకల్పములు ఆవిర్భవిస్తున్నాయి. ఇంక హృదయమునుండి సత్యము, ప్రేమ, దయ, సహనము, సానుభూతి ఇత్యాది నివృత్తి లక్షణములు ఆవిర్భవిస్తూ ఉంటాయి. కనుక మానవుడు హృదయముపైన

sri sathyasaivachanamrutam

దృష్టి పెట్టటంచేత తాను పవిత్రుడుగా మారిపోతున్నాడు. కనుకనే వేదాంతమునందు అంతర్దృష్టిని అలవరచుకోమని బోధిస్తుంటారు. అది ప్రవృత్తి. ఇది నివృత్తి. కాని నివృత్తి తత్త్వము ప్రవృత్తి కేమాత్రము అర్థము కాదు. బాహ్య సంబంధమైన, క్షణికమైన, లౌకికమైన ఈ దేహముతో అనుభవించే ఆనందములే ప్రధానమని భావిస్తూ మానవుడు దీని నిమిత్తమై అనేకవిధములుగా పాటుపడుతూ ఉంటాడు. అట్టివారికి హృదయ తత్త్వము ఏమాత్రం అర్థంకాదు. దానిని సరియైన రీతిలో అనుభవించరు. దేహమునందే హృదయము ఉండినప్పటికిని హృదయతత్త్వం దేహము గుర్తించుకోలేకపోతుంది. ఎట్లనగా

**ఫలములోని మధుర రసం తరువు తానెరుగునా?**<br>
**పువ్వులోని మకరందము తీగలనుభవించునా?**<br>
**కావ్యాలలోని మధురరసము గ్రంథమనుభవించునా?**<br>
**నివృత్తి సారాంశము ప్రవృత్తి పండితుడెట్లెరుంగును?**

చెట్టులోనే ఉంది పండు. పండులోనే ఉంది మధురరసముగాని ఆ రసాన్ని చెట్టు ఏమాత్రం కూడా అనుభవించలేదు. మనదేహమే ఒక వృక్షము. ఇందులోని హృదయమే ఒక ఫలము. ఈ హృదయములోని మాధుర్యమైన ప్రేమయే ఇందులోని రసము. ఈ రసమును దేహమనే వృక్షమేమాత్రం గుర్తించుకోలేదు. అనుభవించటం లేదు. ఆనందించటం లేదు. అర్థం చేసుకోవటం లేదు. కనుకనే మానవుడు ఇన్ని దుఃఖములకు, నిరాశలకు, నిస్పృహలకు గురౌతున్నాడు. ఇట్టి మనయందున్న ప్రేమ తత్త్వాన్ని మనం అర్థము చేసుకోనంత కాలము మనకు భయము తప్పినది కాదు.

ఆ ప్రేమను మనం పొందినప్పుడే మనకు ఈ భయము దూరమవుతుంది. చిన్న ఉదాహరణము. రైలునందు ప్రయాణం చేసే వ్యక్తి టిక్కెట్టుకొని తన జేబులో ఉంచుకొని ఏ 3వ క్లాసులో సీటుపైన కూర్చున్నప్పటికి ఎట్టి భయమూ ఉండదు. కాని టిక్కట్టు లేకుండా ఏ ఫస్ట్ క్లాసులో కూర్చున్నా తనకి భయము వెంటాడుతూనే ఉంటుంది. ఎక్కడ టిక్కట్టు కలెక్టరు వస్తాడో, ఎక్కడ నన్ను పట్టుకుంటాడో అనే భయం అతన్ని వెంటాడుతూనే ఉంటుంది. కారణమేమిటి? తను ఫస్ట్ క్లాసులో కూర్చున్నా భయమెందులకు అతనిని వెంటాడుతుంది?

srisathyasaivachanamrutam

టిక్కట్టు లేకపోవటం చేతనే. అదే విధముగనే మన హృదయంలో ప్రేమ అనే భగవత్ టిక్కెట్టు ఉండినంతవరకు ఎక్కడకు వెళ్ళినా మనకు భయంలేదు.

జీవితమొక ప్రయాణము. ఇలాంటి సమయంలో ప్రేమ అనే నిత్యసత్యమైన విలువైన దీనిని మనము హస్తమునందుంచుకున్నప్పుడే ఎక్కడకు వెళ్ళినా నిర్భయంగా నిస్సందేహంగా నిర్మలంగా నిస్వార్థంగా ఆనందమును ధైర్యమును అందిస్తుంది. ఈనాడు ప్రతి మానవుడు కూడను ఏదో ఒక విధమైన భయాన్ని అనుభవిస్తున్నాడు. ఏకార్యము ప్రారంభించినా మొదలు భయము అతనిని వెంటాడుతుంది కారణం భగవత్ప్రేమ లేకపోవటమే. ఆ భగవత్ప్రేమ ఒక్కదానిని మనం సాధిస్తే సర్వమునూ సాధించిన వారమవుతాము. ఎంతటి విద్యావంతులైనా, ఎంతటి భోగభాగ్యములను భవించేవాడైనా, ఎంతటి పండితుడైనప్పటికిని, ఎంతటి ధనవస్తు వాహనాదులతో తులతూగు చుండినప్పటికిని ఆత్మవిశ్వాసమే లేకుండిన వానికి నిరంతరము అశాంతియే. ఈనాడు ఆత్మవిశ్వాసం అత్యవసరం. అది లేకపోతే దేనినీ మనము సాధించలేము. దేనియందూ మనము ఆనందాన్ని అనుభవించలేము.

**కోరికలే కష్టములకు కారణములు**

అనేక విధములైన కోరికలు పెంచుకోవటంచేతనే మనము చింతలకు గురౌతున్నాము. ఈనాడు ఎక్కడ చూసినా సిరిభక్తులు అధికులౌతున్నారు. కాని హరి భక్తులు కనుపించటం లేదు. ఏది చేసినా, ఏది చూసినా, ఏది చెప్పినా తన స్వార్థము స్వప్రయోజనములను ముందుంచుకొనిపోతున్నారు. ఇది కేవలం తాత్కాలికమైనదే. కనుక మానవత్వంలో మొట్టమొదట మనము గుర్తించవలసినది, సాధించవలసినది దైవప్రేమ. ఏక మనస్కులు కావాలి. దృఢ మనస్కులు కావాలి. నిశ్చల మనస్కులు కావాలి. నిర్మల హృదయం కావాలి. నిస్వార్థమైన భావముతో జీవితమును గడపాలి.

ఒకానొక సమయంలో ఉద్ధవుడు కృష్ణుని సందేశాన్ని తీసుకొని గోకులము వచ్చాడు. ఇక్కడ ఉద్ధవుడు గోపికలకు చెపుతున్నాడు. భగవంతుని ఏవిధముగా మీరు వదలిపెట్టి బాధపడుతున్నారు. ఆ బాధను నివారించే మందును నేను తెచ్చాను. దీనిని మీరు ఆరగించాలి అన్నాడు. ఈ యోగము చేత మీ యొక్క బాధలనే రోగనివారణ అవుతుందని అన్నాడు.



sri sathyasaivachanamrutam

అప్పుడు గోపికలు చెప్పారు. ఓ ఉద్ధవ మహాశయా! మాకు ఎట్టి రోగములు లేవు. కనుక మాకెట్టి యోగములు అక్కరలేదు. ఒక్క కృష్ణుని పొందే యోగము మాకు తెలిస్తే చాలన్నారు. ఏమిటి ఈ యోగము? ఒక గోపిక చెప్పింది. త్యాగ భావముతో అనుభవించే భోగమైనా అది ఒక యోగమే అన్నాది. ఉద్ధవుడు చెప్పాడు. త్యాగమునకు, భోగములకు పొందు కుదరదు కదా. త్యాగముతో ఉన్నవాడు భోగమువైపు చూడడు. భోగమునసుభవించేవాడు త్యాగమును చింతించడు. కనుక భోగమునకు త్యాగమునకు పొత్తు కుదరటం లేదు. కనుక యోగమెట్లా అవుతుంది అన్నాడు ఉద్ధవుడు. పిచ్చివాడా! కృష్ణుని చెంతనుండి నీవు తెలుసుకున్నది యిదియేనా? ఆచరణ లోని అహంకారము, అనుభూతిలోని ఆశక్తి రెండూ వదలితే త్యాగము, భోగము, యోగము మూడూ ఒక్కటే అవుతాయన్నాడు. నేను చేస్తున్నాను అనే అహంకారాన్ని దూరం చేయి. ఇది నేను ఆచరించిన క్రియల వల్ల కలిగిన ఫలితము. ఇది నేనే అనుభవించాలి అనే ఆసక్తిని దూరం చేసుకో. ఆసక్తియందు రాగము, ఆచరణయందు అహంకారము రెండూ వదలితే ఈ భోగమునకు త్యాగమునకు వ్యత్యాసం లేదన్నారు గోపికలు.

ప్రపంచములో వర్షము కురుస్తుంది. నదులు ప్రవహిస్తున్నాయి. పంటలు పండుతున్నాయి. సూర్యచంద్రాదులు ప్రకాశిస్తున్నారు. ఇది ఎవరికోసము. ఏ ఒక్క వ్యక్తి నిమిత్తము కాదు. సర్వమానవులకు దీనిని అనుభవించే సమానమైన అధికారమున్నది. కనుక ప్రాకృతమైన తత్త్వాన్ని అనుభవించటానికి ప్రాకృతమైన జీవులకు సర్వాధికారమూ ఉంది. కాని పరతత్త్వమును అనుభవించటానికి ఏకొద్దిమందో యీ శక్తి సామర్థ్యములు చేర్చుకుంటారు. దైవత్వముపైన సంపూర్ణ విశ్వాసము కలిగినటువంటివారికే ఇది ప్రాప్తిస్తుంది.

కనుక గోపికలందరు కృష్ణునియొక్క వాక్కును విన్నంతనే మురళీగానమును శ్రవణము చేసినంతమాత్రమున వారు భవనములు వదలి వనములలో ప్రవేశిస్తూ వచ్చారు. ఉద్ధవుడు కూడను దీనినే ప్రశ్నించాడు. కృష్ణసందేశం వినటానికే మీకు అవకాశం లేదంటే ఇంక మీలో ఏమి భక్తిఉన్నది. మీ భక్తియొక్క స్వరూపము ఏమిటి? అని ప్రశ్నించాడు. యోగముయొక్క సారాన్ని ఒక్కవాక్యంలో చెప్పారు. ఏమిటి ఉద్ధవా! మాకున్నది ఒకే మనసు. ఆ మనసు కూడా ఇప్పుడు మాతోలేదు. కృష్ణునితో మధురకు వెళ్లింది. మనసే లేని అమనస్కులము మేము.

srisathyasaivahini.org

నీయొక్క యోగములు, సందేశములు వినటానికి మాకెక్కడుంది మనసు. నీవలె మాకు కూడను పది మనస్సులుంటే మేము కూడను ఒక వైపు సందేశం వినటము ఒకవైపు కృష్ణుని చింతించటము, ఒకవైపు అత్తఆజ్ఞను పాలించటము ఒకవైపున భర్త ఆజ్ఞను పాలించటము ఈ విధముగా జరుపుకొని ఉండవచ్చును.

**సకల శాస్త్రాల గ్రంథాల సారమెల్ల**
**ఒక్క వాక్యాన చెప్పుదు ఒక్కసారి**

సర్వజీవులయందు ఉన్నరక్తం ఒక్కటే అని మనం విశ్వసించాలి. ఈ సమస్త చింతలకు మూలకారణము మనసే. దైవచింతనకు కూడను మూలకారణము మనసే.

**పుట్టుట యొక చింత భూమినుండుట చింత**
**సంసారమొక చింత చావుచింత**
**బాల్యమంతయు చింత వార్ధక్యమొకచింత**
**జీవించుటొక చింత చెడుపుచింత**
**కర్మలన్నియు చింత కష్టంబులొకచింత**
**సంతసమొక చింత వింత చింత**

ఈ పండ్రెండు చింతలనే పగ్గములు కట్టిన చింత చెట్టుక్రింద కూర్చొని సంతోషాన్ని అనుభవించాలంటే ఎలాకుదురుతుంది.

**సర్వచింతలు బాపు సర్వేశు భక్తి**
**కొలువుడు ప్రజలార కోర్కెదీర**

సమస్త చింతలను పరిహారము చేసేది ఒక్కటే అదియే ప్రేమ. ఈ ప్రేమయందు ఎట్టి వ్యత్యాసముకూడను మనకు కనుపించదు.

సమస్తము భగవత్ స్వరూపముగానే మనం నిరూపిస్తాము. సర్వత్రా ఉన్నదైవత్వం ఒక్కటే, కనుకనే భగవంతుడు దేశకాలవస్తు పరిచ్ఛేదము లేనివాడు. ఒక దేశములో ఉన్నవాడు ఒక దేశంలో లేడని చెప్పుటకు సాధ్యము కాదు. కనుక దేశకాల వస్తువుల పరిచ్ఛేదము లేనివాడు.

sri sathyasai vachanamrutam

భగవంతుడనగా వ్యాపకశక్తి కలవాడని అర్థము. వ్యాపకశక్తిగల భగవంతుడు ఇక్కడ ఉన్నాడు అక్కడ లేడు అని ఎలా చెప్పగలవు? సర్వత్ర వ్యాపించి ఉంటున్నాడు. కనుక దీనికేమాత్రం అవకాశం లేదు. సర్వత్ర ఉన్నాడనే సత్యాన్ని మనం సుస్పష్టంగా చెప్పవచ్చు. ఇంక కాలము లోపల, ఒక కాలములో ఉన్నాడు మరొక కాలములో లేడు అని చెప్పటానికి వీలుకాదు. ఆది మధ్య అంతములందు ఉండిన భగవంతునికి ఈ కాలమనేది ఎక్కడ ఉంది. ఆది మధ్యాంతరహితుడు అన్నారు. ఇంక ఏకాత్మ స్వరూపుడని చెప్పినప్పుడు ఏ వస్తువు నందున్నాడు ఏ వస్తువునందు లేడు అని చెప్పటానికి వీలవుతుంది? కనుకనే భగవంతుని సర్వాత్మకుడు అన్నారు. ఒక్కొక్క పదమునకు కూడను ఒక్కొక్క విశిష్టమైన అర్థములు కూడి ఉన్నాయి. పదములనుగాని దాని అర్థముగాని మనం ఏమాత్రం గుర్తించుకొనుటకు ప్రయత్నించటంలేదు. సకలశాస్త్రములు సర్వేశ్వరత్వాన్ని సమత్వముగా ప్రకటిస్తూ వచ్చాయి. దేవుడనగా వ్యక్తి స్వరూపుడు కాదు. సమస్తాత్మకుడు. సర్వత్ర ఉన్న ఆత్మతత్త్వం ఒక్కటే. అట్టి ఆత్మనే లోకాన్ని ఉద్ధరించే నిమిత్తం ధర్మాన్ని నిలబెట్టే నిమిత్తము ఒక్కొక్క ఆకారాన్ని ధరిస్తూ వస్తుంది.

**గోపికలకు సాటి ఎవ్వరూ లేరు**

ఇట్టి పరమాత్మ భావాన్ని గుర్తించిన వారే గోపికలు. ఇది చెట్టే ఇది పుష్పమే ఇదికేవలం తీగే ఇది పొదనే అనే భేదభావములు వారికి లేవు. సక్కుబాయి కూడా కృష్ణుడు సర్వవ్యాపకుడని తెలుసు. సర్వస్వరూపుడని తెలుసు. కాని ఆమెకు రంగా రంగా అంటేనే తృప్తి. ఉద్ధవుడు వచ్చి యశోదతో కృష్ణుని అనేక విధములుగా వర్ణిస్తూ ఉంటాడు. యశోదకు ఒక్కటే నామము ఇష్టము. బృందావన విహారి ఎక్కడకు పోయినా నాకక్కరలేదు. నేను పట్టించుకోను. నా గోపాలుడు బాగున్నాడా? గోపాలా గోపాలా గోపాలా! ఆ గోపాల అనే పేరే ఆమెకు చాలా మధురమైనది. అదేవిధముగనే గోపికలంతా కూడ భగవంతుడు సర్వాంతర్యామి అనే విశ్వాసము ఉన్నప్పటికిని తమ కృష్ణ స్వరూపాన్ని మాత్రమే ఆ మృదుమధురమైన వేణుగానాన్ని వినాలనే ఆశమాత్రమే వారికి హృదయం నిండుగా ఉండేది. బృందావనములో ప్రవేశించారు. పిచ్చిపిచ్చిగా తిరుగుతున్నారు. అడుగుతున్నారు పొదలను

**నల్లనివాడు పద్మనయనంబుల వాడు కృపారసంబుపై**

srisathyasaivahini.org

**జల్లెడివాడు మౌళి పరిసర్పిత పింఛమువాడు నవ్వురాజి**
**జిల్లెడు మోము వాడొకడు చెల్వల మానధనంబు దోచెనో**
**మల్లియలార! మీ పొదల మాటున లేడుగదమ్మ చెప్పరే**

ఇక్కడేమైనా దాగున్నాడా చెప్పండి. మల్లెమొక్కలు మాట్లాడతాయా! వృక్షములు మాట్లాడతాయా? వారికేమాత్రం విచారణా శక్తియే లేదు. వారికి విశ్వాసము ఎక్కువగా ఉంటుంది. ఎక్కడ విచారణాశక్తి ఉంటుందో అక్కడ కాలినుండి తలవరకు డౌట్సే. పూర్ణ విశ్వాసము వారికి. ఈ పూర్ణత్వములో నుండినవారికి ఈ సంపూర్ణత్వం యేమి అర్థమవుతుంది?

కృష్ణతత్వము చక్కగా అర్థము చేసుకున్నవారు గోపికలు మాత్రమే. అయితే కృష్ణుడెట్టివాడు. ఇతడు అందరితో ఆడుతూ పాడుతూ ఆనందముగా ఉండినప్పటికిని దేనిని తనలో చేర్చుకునేవాడుకాదు. దేనికి తాను అంటనట్టు ఉండేవాడు. నిత్యతృప్తుడు నిత్యానందుడు, నిర్గుణుడు, నిరహంకారి, మహారాజు. ఎన్ని రాజ్యములు జయించినప్పటికీ ఒక్క రాజ్యమునైనా తాను పాలించలేదు. ఇతరులకు రాజ్యమును కట్టి తాను ఆనందముగా జీవిస్తూ ఉండేవాడు. ఎట్టి వాంఛలు కూడా అతనియందు లేవు. అన్ని వాంఛలు కూడా అన్యుల నిమిత్తమేను. ఇతను నిర్గుణుడవటం చేతనే భగవత్ స్వరూపాన్ని ధరిస్తూ వచ్చాడు. గుణములయందు కూడను భగవంతుడు ఉన్నాడు. కానీ భగవంతునియందు గుణములు లేవు. సూర్యుని నుండి ఏవిధముగా కిరణములు ఆవిర్భవిస్తున్నాయో, ఏవిధముగా భూమినుండి వృక్షములు పుడుతున్నాయో ఆవిధముగా హృదయమునుండి ఆవిర్భవించిన ప్రేమతత్వాన్ని మనము చక్కగా గుర్తించుకున్నప్పుడే ఆ దివ్యత్వమును మనము చక్కగా అర్థం చేసుకోగలము. కనుక మనము నిస్వార్థమైన ప్రేమ నాధారంగా చేసుకొని ఈ ఆధేయమైన జగత్తునందు జీవించి ఈ ఆధార ఆధేయముల రెండింటిని ఏకత్వంగావించే పవిత్రమైన మార్గంలో మనం ప్రవేశించాలి.

ఒకటి ఉపాదాన కారణము. రెండవది నిమిత్త కారణము. నిమిత్త కారణము లోకానికి సంబంధించినది. ఉపాదాన కారణము దైవత్వానికి సంబంధించినది. కనుక ఈ జగత్తంతయు నిమిత్త ఉపాదాన కారణములచేత కూడనటువంటిది. ఈ టంబ్లరు వెండి టంబ్లరు. కాని వెండి ఉపాదానకారణము. దీనిని టంబ్లరుగా చేసిన కంసాలి నిమిత్త కారణము. ఈ సిల్వరు

sri sathyasai vachanamrutam

సృష్టించినవాడు ఇంకొకరు కాదు. భగవంతుడే. దీనిని టంబ్లరుగా సృష్టించినవాడు మాత్రం ఈ లోకంలో ఉంటున్నాడు. ఈనాడు టంబ్లరుగా పెట్టుకోవచ్చు. రేపటిదినం కప్పుగా మార్చుకోవచ్చు. మరుసటిదినం ప్లేటుగా మార్చుకోవచ్చు. ఈ టంబ్లరు, కప్పు, ప్లేటు రూపనామములు మారినప్పటికిని వెండివెండిగానే ఉంటుంది. అదే ఉపాదాన కారణము. ఏతావాతా మార్పు చెందనటువంటివాడు భగవంతుడు. మార్పు చెందేది జగత్తు. చలించే జగత్తునందు స్థిరత్వమైన దైవత్వము ఉంటుంది. ఈ రెండింటితో కూడినదే ఈ లోకము. మీరు నిత్యానుభవములో అనేకం చూస్తున్నారు. బస్సులోగాని కారులోగాని కూర్చుంటే పరుగెత్తి పోతున్నాము. రోడ్డుమీద ఈ కారు కదుల్తోందిగాని రోడ్డు కదలటం లేదు. రోడ్డు కూడా కదిల్తే మనం ప్రమాదానికి గురౌతాం. కనుక కదిలేకారు కదలని రోడ్డుపైన ప్రయాణము సలుపుతున్నాము. అదేవిధముగా రోడ్డు స్థిరమైనది. ఇది ఉపాదానకారణము. కదిలేవారు నిమిత్తకారణము. కనుక ఈ కదిలే జగత్తంతా కూడను కదలని దివ్యత్వమనే ఉపాదాన కారణముపై ఉంది. దానినెవరూ అర్థం చేసుకోవటానికిగాని విచారించటానికిగాని ప్రయత్నించటం లేదు.

నిజంగా ఇది కదిలే జగత్తు అయినప్పటికి ఒక్క దివ్యత్వమనేది మనం చక్కగా అర్థము చేసుకుంటే ఈ శరీరం మనలను ఏమి చేస్తుంది. ఇది ఎన్ని కష్టనష్టములు దుఃఖములతో కూడినదైనప్పటికిని దీనితో మనం యేమాత్రము భయపడనక్కరలేదు. ఈత నేర్చుకున్న వానికి నీటిలోతు ఏవిధముగా భయపెడుతుంది. ఈత నేర్చుకుంటే నీటియొక్క లోతుగురించి మనం భయపడనక్కరలేదు. అదేవిధముగనే దైవప్రేమనే మనం సంపాదించుకుంటే ఈ ప్రపంచమునందు కలిగే వికారమునకు మనము భయపడనక్కరలేదే? గోపికలు అట్టి ప్రేమను సాధించినటువంటి వారు. దైవంప్రేమ స్వరూపుడే. సమయ సందర్భానుసారంగా కొంచెం మారినట్లు కనుపిస్తుందిగాని అవి భగవంతుని యొక్క మార్పులు కావు. భక్తులలో ఉండే మార్పులే వారికి ప్రతిబింబముగా ప్రతిబింబిస్తూ ఉంటుంది. దానినే guilty conscience అంటారు. తమదోషములే భగవంతునిపై ఇమిడ్చి దర్శనము చేసుకునే దానికి ప్రయత్నిస్తారు. భగవంతునిలో ఎట్టి దోషములు ఉండటానికి వీలులేదు. దోషరహితుడు. అందుకే నిర్దోషో నిర్మలో నాథః అన్నారు. అతనే పురుషుడు. సదోషో చంచలో వధూః అనే ప్రకృతి. ఇది దోషములతో కూడినటువంటిది. చంచలమైనటువంటిది కాని దానిలో కూడ నిశ్చలమైనట్టి నిర్దోషమైనట్టి

srisathyasaivachanamrutam

దివ్యత్వాన్ని సందర్శించాలి.

**దైవాజ్ఞను అనుసరించండి**

ప్రేమస్వరూపులారా! కేవలం కృష్ణ జన్మదినము రామ జన్మదినమని మాత్రమే ఆనాడు మనం పండుగ పర్వదినముగా భావిస్తున్నాం. పర్వదినములు చేసుకోవటం చేత వచ్చే ఫలితము ఏమాత్రం ఉండదు. ఎవరిని భగవంతుడని మనము విశ్వసిస్తున్నామో వారి వాక్యములనాచరించటానికి తగిన కృషి చెయ్యాలి. దీనిని మనం అభ్యాసములో పెట్టకుండా ఎంతో భక్తిశ్రద్ధలతో మనం పూజించినప్పటికిని ప్రయోజనం లేదు. ఇది కేవలం ప్రాకృతమైన సత్కర్మలుగా మనం భావించవచ్చు. మనం ఒకటి రెండైననూ ఆచరణలో పెట్టటానికి పూనుకోవాలి. అన్ని అవతారములకంటె కృష్ణావతారము చాలా ఆకర్షణీయమైనది. అందువల్లనే కృష్ణా అనే పేరులోనే పవిత్రత ఉంది. దీని అంతరార్థము. కర్షతీతికృష్ణః అన్నారు. ఆకర్షించేది కృష్ణతత్వము. కృషి తీతికృష్ణః అన్నారు. కృషి అనగా సేద్యం చేయటం. భూమిపైన పంటలు పండించటము. ఇక్కడ హృదయమనే క్షేత్రములో దుర్గుణములనే మొక్కలు తీసివేసి సద్గుణములు సదాచారములనే పంటలు పండిస్తూ ఉంటాడు. కనుకనే కర్షతీతి కృష్ణః అన్నారు. కాని కట్టకడపటికి కుష్‌తీతి కృష్ణః అన్నారు. అనగా ఆనందమును అందించేది. చాలాఖుషీగా ఉన్నావే అంటారు. ఖుష్ అనేది కృష్ణతత్వమునుండి వచ్చినది. కృష్ణా అనగా హృదయాన్ని సాగుచేసి మనకు దివ్యత్వమైన ఆనందము అనే పంటనందించేవాడు. ఆ ఆకర్షించే హృదయం కలిగినవాడు కనుకనే అతనికి ఆత్మారాముడని పేరు. అన్నింటిని ఆకర్షిస్తున్నది ఈ ఆత్మ ఆనందాన్ని అందిస్తోంది. ఈ మూడింటి చేతనే కృష్ణ అనే పేరు వచ్చింది. ఇక్కడ మరొకటి కూడను మనం యోచించాలి.

భగవద్గీతయందు

**ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యయుత్సవః**
**మమకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ**

అనేది ప్రథమ శ్లోకము. ధర్మక్షేత్ర మనగా ఏమిటి? ఎక్కడో ఒక ప్రదేశంలో ఉండినటువంటిది కాదిది. మనదేహమే మొట్టమొదట ధర్మక్షేత్రంగా ఉంటుంది. పుట్టిన సమయములో నిశ్చలమై,



srisathyasaivachanamrutam

నిస్వార్థమై, నిరహంకారమై ఎట్టి కోరికలు లేకుండా పవిత్రమైన హృదయంగా ఉంటుంది. నిర్గుణుడై ఉంటాడు. అట్టి మానవ జీవితమనే ధర్మక్షేత్రముగా పోల్చుకున్నారు. ఇది పెరుగుతూ పెరుగుతూ ఆహారం మారిన కొలది అభిరుచులు అభివృద్ధి అయినకొలది సహవాస దోషములు, పాశములు అంటగట్టుకున్న కొలది మరింత బాధలేర్పడుతూ వస్తుంటాయి. కొన్ని రాగద్వేషములు కూడా ఇందులో ప్రవేశిస్తాయి. అభిమాన మమకారములు అభివృద్ధి అవుతూ ఉంటాయి. అప్పుడే ఇదికురుక్షేత్రంగా మారిపోతూ ఉంటుంది. నేను, నీవు అనే భేదము ఏర్పడినప్పుడే ఒకదానికొకటి ప్రారంభమవుతుంది. నా, పర అనేది లేనంతవరకు అది ధర్మక్షేత్రము. నా, పర అనేవి ప్రారంభమయ్యేటప్పటికి కురుక్షేత్రంగా మారిపోయింది. కనుక ఈ ధర్మక్షేత్రంగా పుట్టి, కురుక్షేత్రంగా మారిన దీనిలో మామకాః పాండవాశ్చైవ మమత్వమనే నావారు, పరిశుద్ధమైన సాత్త్విక గుణములు. కిమకుర్వత సంజయ ఏమి చేస్తున్నాయని ధృతరాష్ట్రుడు అడిగాడు. ఈ ధృతరాష్ట్రుడనగా ఏమిటి? దైవప్రేమ లేక, ఆత్మజ్ఞానము లేక, లౌకికమైన విషయ వాసనలో మునిగినటువంటివాడు ధృతరాష్ట్రుడు. విషయవాసనలలో మునిగినవారు ధృతరాష్ట్రుడు. నావారు, నావారు నేను నావారు అదే అభిమానం పెంచుకున్నాడు. ఇంతేకాదు. దుష్టులు, దుర్మార్గులు అయిన కుమారులు ఏమి చేసినాగాని దానిని సమర్థించి సై అనేవాడు ధృతరాష్ట్రుడు. తమ కుమారులు గావించే అన్యాయ అక్రమ అనాచారములనంతా సమర్థించుకుంటూ వచ్చేవాడు ధృతరాష్ట్రుడు. ఈనాడు అలాంటి తల్లిదండ్రులధికం కావటంచేత అలాంటి కౌరవులు అధికమై పోతున్నారు భూమిమీద.

**మన దేహమే ధర్మక్షేత్రము**

అట్టి అజ్ఞానానికి ప్రక్కలో ఉన్నాడు జ్ఞాని సంజయుడు. అనగా అన్ని ఇంద్రియములను నిగ్రహించుకున్న మహాజ్ఞాని. సంజయా! నీవు నాకు చెప్పు అన్నాడు. జ్ఞాని కనుకనే నీవు నాకు చెప్పటానికి అధికారము ఉన్నది అని అర్థము. నాకు కావలసినన్ని సిరిసంపదలు ఉన్నా నాకు ఆనందాన్ని అందించటం లేదు. ఒక్క ఇంద్రియ నిగ్రహమే ఆనందాన్ని అందిస్తుంది. ఒక్క దైవప్రేమనే ఆనందాన్ని అందిస్తుంది. దీనికి ధృతరాష్ట్రుడు సరియైన ఉదాహరణ. నిరంతరము హంసతూలికా తల్పముపై పవళించినప్పటికి నిప్పులపైన పవళించినట్లుగా ఉంటుంది అతనికి.

sri sathyasai vahanamrutam

కారణం దైవప్రేమ లేకపోవటం చేతనే, పాపభీతి లేకపోవటమే. దైవప్రీతి, పాపభీతి ఎక్కడుంటాయో అక్కడ నిశ్చింతగా జీవితం గడపవచ్చు. కనుకనే ధర్మక్షేత్రమనేది ఎక్కడో ప్రత్యేకంగా ఉండినటువంటిది కాదు. మన దేహమే ధర్మక్షేత్రము. దోష రహితమైన దేహమే ధర్మక్షేత్రము, దోషములతో కూడిన దేహమే కురుక్షేత్రము. అనగా ప్రవృత్తి లక్షణములు, నివృత్తి లక్షణములు రెండూ ఉన్నాయి ఈ దేహములో. ఈ రెండింటికి ఎల్లప్పుడు పోరాటం జరుగుతూనే ఉంటుంది. అందువల్లనే ఈ ప్రవృత్తి లక్షణాలు దూరంగావించుకొని, నివృత్తి లక్షణాలకే ఆత్మస్వరూపుడైన కృష్ణుడు సహాయంగా ఉంటున్నాడు.

విజ్ఞానులారా! ఈనాడు భగవద్గీతయొక్క అంతరార్థమును మనము చక్కగా గుర్తించాలనుకుంటే కౌరవులకు పాండవులకు ఉన్న వ్యత్యాసాన్ని మనము చక్కగా అర్థం చేసుకోవాలంటే మనం ఈ మహాభారతంలో లోతుగా దిగి విచారించాలి. పాండవులు ఏచిన్న పని చేసినప్పటికి కృష్ణుని ముందు పెట్టుకొని ప్రారంభిస్తున్నారు. రాజసూయయాగం చేయాలనుకుంటే కృష్ణుని ఆజ్ఞకోసం కాచుకొని ఉన్నారు. ఏకార్యం చేయవలెనన్నా ముందు కృష్ణుడు. అందువలననే పాండవులు విజయాన్ని సాధించారు. కేవలం భౌతికమైన సిరిసంపదలతో తులతూగుతూ అదే మాకు ప్రధానము, అదే మాకు నిత్యము సత్యము అని విశ్వసించినవారు కౌరవులు. కృష్ణుని విస్మరించారు. విశ్వమును విశ్వసించారు. సర్వనాశనం గావించుకున్నారు. పాండవులకు, కౌరవులకు ఉన్న వ్యత్యాసము. కృష్ణుని యొక్క సహాయ తత్త్వము ఏవిధముగా ఉంటున్నాయో మనకు మహాభారతం బోధిస్తుంది. పాండవులంతా కూడను God first, world next, I lost అనుకున్నారు. కౌరవులు అలాకాదు. I first, world next, last God. కనుక భగవంతుని ముందుంచుకొని జీవితాన్ని సాగించినటువంటి వారికి ఎప్పుడూ విజయమే. ఇదియే చెప్పాడు ధృతరాష్ట్రునితో సంజయుడు ధృతరాష్ట్రా!

**యత్ర యోగేశ్వరః కృష్ణోయత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ**

ఎక్కడ భగవంతుడైన కృష్ణుడు, ఎక్కడ సంపూర్ణ విశ్వాసము కలిగిన అర్జునుడు ఇరువురూ ఉంటారో అక్కడ సంపూర్ణ విజయం సాధించుకుంటారని చెప్పాడు. భగవంతుడు భగవంతునికి

srisathyasaivachanamrutam

తగిన విశ్వాసము రెండూ ఉండాలి అక్కడ. భగవంతుడు ఉండి కూడా భగవంతునిపై విశ్వాసం లేకపోతే విజయాన్ని సాధించలేవు. విజయం భగవంతునియొక్క అధీనంలో ఉంది. కనుక భగవంతునే మనం స్వాధీనం చేసుకుంటే విజయం మన వెంటనే ఉంటుంది. త్యాగరాజు కూడా చెప్పాడు. రామా! నీ అనుగ్రహబలము ఒక్కటి ఉంటే నవగ్రహములు నా హస్తగతమై పోతాయి అన్నాడు. ఆ ఒక్క భగవత్ప్రేమను మనం సాధిస్తే సర్వము కూడను సాధించినవారమవుతాము. సర్వత్రా ఉన్నది ఒక్కటే. అదేప్రేమ. కనుక అట్టి ఆధారమైన ప్రేమను మనం సాధించటానికి తగిన ప్రయత్నం చేయాలి. కృష్ణ జీవితములో ప్రధానమైన ఉపదేశము ప్రేమ తత్త్వమే.

ఈ ప్రేమ లేక కృష్ణతత్త్వము మనకేమి అర్థము కాదు. తానే ప్రేమమయుడు. సర్వమును లోకానికి అందించినవాడు. ఇలాంటి ప్రేమద్వారానే ప్రేమను మనం చూడాలి. ఈ ప్రేమ మహాకఠినమైనది. అనగా గట్టిది. చాలా విలువైనది. చాలా ప్రకాశవంతమైనది. ఇట్టి ప్రేమ అనే వజ్రాన్ని మనం పొందాలంటే ఈ ప్రేమ అనే వజ్రాన్ని మనము సరియైన రీతిలో తీర్చిదిద్దుకోవాలంటే ప్రేమ అనే వజ్రంతోనే తీర్చిదిద్దుకోవాలి. ఈ diamond cut చేసేవాని దగ్గరకు పోయి చూస్తే ఈ diamondను diamondతోనే cut చేస్తారుగాని ఇంకొక కత్తితో చేయటానికి వీలుకాదు. మన ప్రేమలో మాలిన్యమేమైనా ఉంటే ఆ ప్రేమ డైమండ్స్‌తోనే ఆ మాలిన్యం తీసివేయాలి. ప్రేమచేతనే ప్రేమను పొందటానికి వీలౌతుంది. ద్వేషము చేత ప్రేమను పొందటానికి ఏమాత్రం వీలుకాదు. ద్వేషము చేత ద్వేషమే మనకు సంభవిస్తుంది. అసూయ చేత అసూయనే మనకభివృద్ధి అవుతుంది. క్రోధము చేత క్రోధమునే మనం పెంచుకుందాం. ప్రేమచేత ప్రేమనే మనం పెంచుకుందాం. కనుక ఈ ప్రేమను పొందాలనుకుంటే, ఏ అసూయనో, ద్వేషమో, క్రోధమో మనం ఆధారంగా తీసుకోరాదు. ప్రకాశించే చంద్రుని చూడాలంటే మనం ఏ టార్చిలైటు, హరికేన్ లాంతరు, పెట్రొమాక్సు లైటు తీసుకొని పోతున్నామా? ఆ చంద్రునియొక్క ప్రకాశం చేతనే చంద్రుని చూడవచ్చు. అదేవిధముగనే కృష్ణుడు ప్రేమ స్వరూపుడు కనుక అట్టి ప్రేమ స్వరూపుడినే ప్రేమ ద్వారానే పొందటానికి ప్రయత్నం చేయాలి.

**(తేది. 24-08-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam